క్లుప్తంగా

ఓటరు నమోదు కేంద్రాల సందర్శన

సంగెం: ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ సందర్శించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లోని ఓటరు నమోదు శిబిరాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. సాధారణ ఓటరు నమోదుతో పాటుగా ఎమ్మెల్సీ ఓటు నమోదుకు తీసుకోవాల్సిన సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డుల గురించి వివరించారు. తప్పులు లేకుండా ఓటరు జాబితాను రుపొందించి ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికి బీఎల్ఓలు కృషి చేయాలని సూచించారు. నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు కల్పన, శారద, బాలాజీ, రవి ఆయా గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

నూతన మజీద్ ప్రారంభం



పర్వతగిరి: మండలంలోని కొంకపాకలో జిల్లా ముస్లిం మతపెద్దల సహకారంతో నూతనంగా నిర్మించిన జామా మసీద్‌ను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ సర్వర్, సర్పంచ్ వర్కాల రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ అధ్యక్షుడు అబూబక్కర్ మాట్లాడుతూ మజీద్ నిర్మాణానికి కులపెద్దలు ఇచ్చిన నిధులతో పాటు మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రహరీ గోడ, ఇతర నిర్మాణ ఖర్చుల కోసం రూ.5లక్షల ప్రొసీడింగ్ కాపీని ఇచ్చారని తెలిపారు. ఎంపీటీసీ కర్నిక్ల మోహన్ రావు, మండల మైనార్టీ నాయకులు షేక్ మహ్మద్ అలీ, గౌస్‌పాషా, మోయిన్‌పాషా, మహబూబ్‌లీ, అజహర్, కులపెద్దలు, పాల్గొన్నారు.

అక్షింతల ఊరేగింపు



నెక్కొండ: అయోధ్య రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సోమవారం చేయనున్న నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆధ్వర్యంలో పూజ చేసిన అయోధ్య అక్షింతలు మండలానికి చేరిన విషయం విదితమే. మండలంలోని అమీన్‌పేటలో ఆదివారం సర్పంచ్ గరికపాటి హన్మంతరావు గ్రామస్తులతో కలిసి భజన కీర్తనలు, డప్పుచప్పుళ్ల మధ్య అక్షింతలను ఊరేగించి ఇంటింటికి అందించారు. అలాగే పనికరలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపనను పురస్కరించుకొని గ్రామంలో మద్యం, మాంసం ముట్టమని గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

యువజ్యోతి యూత్ కార్యవర్గం ఎన్నిక

చెన్నారావుపేట : మండలంలోని పాత మగ్దుంపురంలోని యువజ్యోతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చెరిపల్లి రాజు, యూత్ అధ్యక్షుడిగా గద్దల ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా మాదాసి దేవేందర్, కార్యదర్శి వేల్పుల శ్రీకాంత్, సలహాదారులుగా జన్ను రమేష్, ప్రధాన కార్యదర్శిగా మాదాసి రమేష్, ముఖ్య సలహాదారులుగా గుర్రం స్వామి, ప్రచార కార్యదర్శిగా ఎండీ ఫిరోజ్‌లను ఎన్నుకున్నారు.


శతాధిక వృద్ధుడి మృతి



ఓదిరెడ్డి (ఫైల్)

చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన ఎనగందుల ఓదిరెడ్డి (110) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య శాంతమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు, ముగ్గురు మనుమలు, ముగ్గురు మనుమరాళ్లు ఉన్నారు. కాగా మృతదేహంపై గ్రామ పెద్దలు, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రామభక్తిని చాటిన గీతాంజలి విద్యార్థులు



నర్సంపేట: పట్టణంలోని గీతాంజలి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు సోమవారం అయోధ్యలో జరగబోయే శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా తమ రామభక్తిని చాటుకున్నారు. బాలరాముడి ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమానికి సంఘీభావంగా ఆదివారం విద్యార్థులు శ్రీరామ్ ఆకారంలో కూర్చుని జైశ్రీరామ్.. జైశ్రీరామ్ అంటూ నినదించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెల్లో గుప్పుమంటున్న గుడుంబా

- మండలంలో యథేచ్ఛగా తయారీ, అమ్మకాలు
- బానిసలవుతున్న యువత, వృద్ధులు
- అనారోగ్యంతో మృత్యువాత పడుతున్న వైనం



సంగెం మండలం తండాలో గుడుంబా తయారు చేస్తున్న దృశ్యం

సంగెం : గుడుంబాను నిర్మూలించామని చెప్పుకోవడమే తప్ప ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. మండలంలో ప్రతి గ్రామం, తండాల్లో గుడుంబా దొరకని వాడలు లేవు అంటే అతిశయోక్తి కాదు. వరంగల్‌కు సమీపంలో ఉండడంతో గుడుంబా తయారీ అమ్మకాల వ్యాపారం జోరుగా సాగుతున్నది. ప్రజాసంక్షేమం పట్టని ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనం, మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్య వైఖరి వెరసి మండలంలో భారీ స్థాయిలో గుడుంబా తయారీ, అమ్మకాలు మూడు కిలోల బెల్లం, ఆరు లీటర్ల గుడుంబాగా నిత్యం వర్ధిల్లుతున్నది. మండలం నుంచి తయారైన గుడుంబాను సులభంగా వరంగల్ నగరానికి చేరవేస్తూ కొందరు సోమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. గుడుండా తయారీకి అవసరమైన బెల్లంను మహారాష్ట్ర నుంచి తీసుకుని వచ్చి ఎక్కువ మొత్తంలో నిల్వ చేసుకున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. నెలనెల ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు ముట్టజెప్పుతుండడంతో వ్యాపారానికి అడ్డూ అదుపులేకుండా పోతున్నదనే ఆరోపణలున్నాయి. అపుడప్పుడు నామమాత్రపు దాడులు నిర్వహిస్తు ఎక్కువ మొత్తంలో గుడుంబా, పానకం, నల్లబెల్లం, పటికలు దొరికినప్పటికి రికార్డుల్లో తక్కువగా లభించిందని, నిందితులు దొరికినా పారిపోయారని అధికారులు చేతులు దులుపుకుంటుండడంతో వ్యాపారం యథేచ్ఛగా సాగుతుందని పలువురు బాధిత కుటుంబాల వారు ఆవేదన చెందుతున్నారు.

వ్యసనానికి బానిసైన యువత

పలు గ్రామాల్లో గుడుంబా వ్యసనానికి బానిసలైన యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటుంది. గుడుంబాకు అలవాటు పడినవారు ఇంట్లో ఉన్న సరుకులు, వస్తువులు విక్రయించి సేవిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. ఈ విధంగా తాగి ఆరోగ్యం క్షీణించి మండలంలో పలువురు మత్యువాత పడుతున్నారు. దీంతో యుక్త వయస్సులో 20 ఏళ్లకే భర్తలను కోల్పోయి వితంతువులుగా మారిపోతున్నారు. మండలంలో 80 శాతం మంది యుక్తవయస్సులో భర్తలను కోల్పోయినవారే ఉన్నారు. ఇలాంటివారు కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కులేక పలుకుటుంబాలు వీధిన పడుతున్నాయి. తాము చేయని తప్పుకు పిల్లల కోసం మోడువారిన జీవితాలను గడపాల్సి వస్తుందని భర్తలను కోల్పోయిన వితంతువులు మౌనంగా రోదిస్తున్నారు.

టెక్స్‌టైల్ పార్కు ఏరియాలో ఏరులై పారుతున్న గుడుంబా

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏరియాలో గుడుంబా ఏరులై పారుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఏరియాలో లేబర్ ఎక్కువ ఉండడంతో తుమ్మ చెట్లలో స్థావరాలు ఏర్పాటు చేసుకుని గుడుంబా అమ్మకాలు సాగిస్తుండగా పలువురు యువత గుడుంబాకు బానిసై అనారోగ్యం పాలవుతున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి మండలంలో గుడుంబా తయారీ, అమ్మకాలను అరికట్టి సమాజానికి మేలు చేయాలని పలువురు దీనంగా వేడుకుంటున్నారు.

దాడులు నిర్వహిస్తాం

మా ఎక్సైజ్ పరిధిలో నాలుగు మండలాలున్నాయి. సిబ్బంది తక్కువగా ఉన్నారు. మాకు గుడుంబా తయారీ, అమ్మకాలపై ఫిర్యాదులు రాగానే దాడులు చేస్తున్నాం. రోజుకో మండలంలో వాచ్ చేసి గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తున్నాం, కేసులు నమోదు చేస్తున్నాం. బెల్లం అమ్మకుండా బైండోవర్ సైతం చేశాం. గుడుంబా తయారు చేసినా, అమ్మినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

– స్వరూప, ఎక్సైజ్ సీఐ, వర్ధన్నపేట

కులవృత్తులను ప్రోత్సహిస్తాం..

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

గీసుకొండ : రాష్ట్రంలోని తమ ప్రభుత్వం కుల వృత్తులను ప్రోత్సహించి వారు ఉపాధి పొందేలా కృషి చేస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొనాయమాకుల రైతు వేదికలో జిల్లా కుమ్మరి సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. తన నియోజకవర్గంలో కుల వృత్తుల సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

అక్కడ మంత్రి.. ఇక్కడ ఎమ్మెల్యే పూజలు

ఇది ఇలా ఉండగా మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి కుటుంబ సమేతంగా తమ ఆరాధ్య దైవం కోటమైసమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అదే సమయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి మండలంలోని ఇలవేల్పు కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న సారంగపాణి

నల్లబెల్లి: ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తిరుమల తిరుపతికి పాదయాత్ర చేపట్టిన జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి బృందం ఆదివారం మండలానికి చేరుకోగా.. స్థానిక బీఆర్ఎస్ నాయకులు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. మండలంలోని బొల్లోనిపల్లి, రాంతీర్థం, బిల్‌నాయక్ తండా, శనిగరం, రుద్రగూడెం, నారక్కపేట గ్రామాల మీదుగా పాదయాత్ర బృందం నర్సంపేట మండలానికి చేరింది. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ లోక కల్యాణార్థం భూపాలపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని మొక్కులు తీర్చుకునేందుకు పాదయాత్రగా తిరుమల తిరుపతికి వెళ్తున్నట్లు తెలిపారు. స్వాగతం పలికిన వారిలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, జెడ్పీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ ఊడుగుల సునీత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, మాజీ జడ్పీటీసీ బానోత్ హరినాథ్‌సింగ్, నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలెపు రాజేశ్వర్ రావు, మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్, సర్పంచ్ ఊరటి అమరేందర్, గోనెల పద్మ, ఎండీ.నజీమా బేగం, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

అనాథ వృద్ధుడిని చేరదీసిన 'సహృదయ'



సంగెం: ఒంట్లో ఓపిక ఉన్న వరకు కూలీనాలీ చేస్తూ తన పనులు చేసుకుని జీవించి నేడు వృద్ధాప్యం కారణంగా పనులు చేసుకోలేకుండా తన వారు ఎవరు లేని వృద్ధుడిని హనుమకొండలోని సహృదయ అనాథ, వృద్ధాశ్రమ నిర్వాహకుడు చోటు చేరదీశాడు. మండలంలోని గవిచర్లకు చెందిన కూరపాటి పుల్లయ్య (70)కి వివాహం కాలేదు. ఇన్నాళ్లు కూలీనాలీ చేసుకుని జీవనం సాగించాడు. వయస్సు మీదపడి తన పనులు తాను చేసుకోలేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గ్రామస్తులు సహృదయ నిర్వాహకులు యాకూబ్, చోటులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన చోటు ఆదివారం గ్రామానికి వచ్చి గ్రామస్తుల సమక్షంలో పుల్లయ్యను అనాథ ఆశ్రమానికి తీసుకునివెళ్లాడు. చోటును గ్రామస్తులు అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఖానాపురం: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరిబాబు, వెంకటప్రసాద్‌రావు, వేణుగోపాల్, ముఖేష్, తదితరులు ఉన్నారు.

చెన్నారావుపేట: మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు భూక్య రాంసింగ్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించాడు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కెనాల్‌లో మృతదేహం లభ్యం

వర్ధన్నపేట: వర్ధన్నపేట శివారు తాళ్లకుంట తండా సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం ఆదివారం స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. నీటిలో తేలియాడుతున్న మృతదేహానికి తల కనిపించడం లేదని, చూడడానికి భయంకరంగా ఉన్నట్లు తండావాసులు వాపోయారు. కొందరు మృతదేహాన్ని తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించగా ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియా మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అనుమానాస్పద స్థితిలో కొట్టుకు వచ్చిన మృతదేహం స్థానికంగా కలకలం రేపింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నల్లబెల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని రుద్రగూడెంలోని జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రుద్రగూడెం పెద్దతండా గ్రామానికి చెందిన అజ్మీరా రవి వ్యక్తిగత పనిపై తన ద్విచక్రవాహనంపై ఊళ్లి తిరుగు ప్రయాణంలో ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో నారక్కపేటకు చెందిన ఓ వ్యక్తి రుద్రగూడెం వైపు ద్విచక్రవాహనంపై వస్తూ రవి వాహనాన్ని ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి నర్సంపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

చెన్నారావుపేట: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువు ములుక ఐలయ్య, సీనియర్ యోగా గురువు శిక్షకులు సదానందం, బాపూజీలు అన్నారు. మండల కేంద్రంలోని జాగృతి స్కూల్‌లో 21 రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రజలను మేల్కొపడానికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



పర్వతగిరి: మండలంలోని చింతనెక్కొండలో లయన్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో కుడికాల మల్లేషం మెమోరియల్ ధాత్రి ఫౌండేషన్ అధ్యక్ష తన క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన పోటీల్లో రాయల్ కింగ్స్ మొదటి బహుమతి సాధించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఎస్సై వీరభద్రరావు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు దిలీప్‌రాజ్, సర్పంచ్ గటిక సుష్మమహేష్, ఉపసర్పంచ్ ధర్మోజు దేవేందర్, ఎంపీటీసీ ముద్రబోయిన సుభాషిణీవాసు, గ్రామ హితకారిని సేవా సంఘం అధ్యక్షుడు గటిక మల్లయ్య, యూత్ కమిటీ ఆర్గనైజర్ మామిండ్ల రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలరాముడి ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు



నర్సంపేట రూరల్ : అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ సోమవారం చేపట్టనుండడంతో మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు. సోమవారం ఉదయం అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, మహా అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆలయకమిటీ బాధ్యులు, సర్పంచ్‌లు, యువజన సంఘాల బాధ్యులు తెలిపారు. అయోధ్యలో బాలరామునిప్రతిష్ఠ సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా అందంగా తయారుచేస్తున్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా..

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ నవీన్, అధ్యాపకులు

నర్సంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్, అధ్యాపకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడుతూ గతంలో మాధవరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కళాశాల న్యాక్ గుర్తింపు కోసం సహాయ సహకారాలు అందించారన్నారు. 2022లో కళాశాల న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు సాధించిందని, 2023–24విద్యా సంవత్సరం నుంచి 2032–33 వరకు పదేళ్ల పాటు స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదా సాధించిందని తెలిపారు. ఎమ్మెల్యే కళాశాల సాధించిన విజయాలను ప్రశంసిస్తూ ప్రిన్సిపాల్‌ను అభినందించారు. కళాశాల అభివృద్ధి కోసం, విద్యార్థుల ప్రయోజనాల కోసం ఎల్ల ప్పుడు ముందుంటానని, కళాశాలలో కావాల్సిన సదుపాయాలు ఏర్పర్చడానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమేష్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ.శ్రీనాథ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఐ.శివ నాగశ్రీను, అకడమిక్ కో ఆర్డినేటర్ ఎం.నరేందర్, డాక్టర్ బి.విష్ణుకుమార్, తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

రాష్ట్రంలో ప్రజలు ఆయురారోగ్యంగా సుఖ సంపదలతో ఉండాలని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే మాధవరెడ్డి కొత్తగూడలోని గుంజేడు ముసలమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అన్ని వేళలా సేవలందించే విధంగా గుంజేడు ముసలమ్మతల్లి ఆశీస్సులు ఉండాలని కోరారు. అనంతరం ఆలయ ఈఓ, ప్రధాన పూజారి ఎమ్మెల్యేకు అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

పలు ఆలయాల్లో 'స్వచ్ఛత'



నర్సంపేట: పోచమ్మ దేవాలయ పరిసరాల్లో శుభ్రం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు



పర్వతగిరి: రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నర్సంపేట: అయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పోచమ్మ దేవాలయంతో పాటు వివిధ దేవాలయాల్లో అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు ఆదివారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నర్సంపేట ప్రముఖ్ మోతె సమ్మిరెడ్డి మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శ్రీరామ మహా మంత్రజపం, ప్రత్యేక పూజలు ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యేక ప్రసారాలు జరుగుతాయని తెలిపారు. నర్సంపేటలోని ప్రతి దేవాలయం కేంద్రంగా మహా అన్నప్రసాద వితరణలు జరుగుతాయని,ప్రజలందరూ కుటుంబ సమేతంగా పాల్గొని శ్రీరామచంద్రుడి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వసంతరావు, ఐలోని రవి, వికాస తరంగిణి అధ్యక్షుడు ఎం వీ.కృష్ణారావు, పోచమ్మ దేవాలయం కమిటీ సభ్యులు, ప్రధాన పూజారి కల్వచర్ల వాసుదేవాచారి, కల్వచర్ల రామాంజనేయచారి, కల్వచర్ల సుధాకర్‌చారి, గన్నోజు వేణు, సాంబయ్య, ప్రసాద్, పాల్గొన్నారు.

పర్వతగిరి: మండలంలోని దేవాలయాలను తీర్థ క్షేత్ర ట్రస్ట్ బాధ్యులు ఆదివారం స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. పర్వతగిరిలోని రామాలయంలో శుద్ధి చేసిన అనంతరం ఆలయాల్లో పూజలు నిర్వహించారు. సోమవారం గ్రామస్తులు రామాలయానికి వెళ్లి పూజలు చేయాలని ట్రస్ట్ సభ్యులు కోరారు.

'గుంటూరు కారం'లో విలన్ల పేర్లు తొలగించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వర్ధన్నపేట: ఈ నెల 12న విడుదలైన గుంటూరు కారం సినిమాలో విలన్లకు పెట్టిన మహనీయులు మార్క్స్, లెనిన్‌ల పేర్లను తొలగించాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ డిమాండ్ చేసింది. మండల కేంద్రంలో భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నిరసన వ్యక్తం చేసింది. ముందుగా లెనిన్ శత వర్ధంతి సందర్భంగా పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ సమీర్, ఇస్లావత్ కల్యాణ్ మాట్లాడుతూ కార్ల్ మార్క్స్, లెనిన్ల పేర్లు గుంటూరు కారం సినిమాల్లో విలన్ పాత్రలకి పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. డైరెక్టర్ త్రివిక్రమ్ ఫాసిస్టు భావజాలాన్ని నరనరాన నింపుకుని ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. డైరెక్టర్ త్రివిక్రమ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, అభిరామ్, సాయికిరణ్, ప్రవీణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నూతన కమిటీ ఎన్నిక

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లిలో బాలవికాస మినరల్ వాటర్ ప్లాంట్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నెబోయిన చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా బండారి ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎరెల్లి కిరణ్, సహాయ కార్యదర్శిగా కందకట్ల రఘుపతి, కోశాధికారిగా గుడిపెల్లి మోహన్‌రెడ్డితో పాటు పలువురు కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల మమత, ఉప సర్పంచ్ జంగ రాజిరెడ్డి, వాటర్ ప్లాంట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు క్రిష్టారెడ్డి, ప్లాంట్ మాజీ అధ్యక్షుడు అంద్య రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ ఆలోచనలు సజీవం



నర్సంపేట : లెనిన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



దుగ్గొండి: లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుమారస్వామి, రమేష్

నర్సంపేట : మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ ఆలోచనలు సజీవమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపెల్లి బాబు అన్నారు. లెనిన్ 100వ వర్ధంతి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాబు మాట్లాడుతూ ప్రపంచంలో మొట్టమొదటి సోషలిస్టు విప్లవ నిర్మాత లెనిన్ అని కొనియాడారు. లెనిన్ నాయకత్వంలో జరిగిన రష్యా విప్లవం ప్రపంచ చరిత్రపై ప్రభావం పడిందని, అనేక విముక్తి పోరాటాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి, సీపీఎం నాయకులు హన్మకొండ శ్రీధర్, గడ్డమీది బాలకృష్ణ, కలకోటి అనిల్, విజయ, స్వప్న, జగన్నాథం, కార్తీక్, నాగమణి, బి.లక్ష్మి, ఇందిరా, కేరి, యాకలక్ష్మి, నర్సింహరాములు, వెంకన్న, పైసా గణేష్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో..

దుగ్గొండి: మండలంలోని గిర్నిబావిలో ఎంసీపీఐ(యు) పార్టీ ఆధ్వర్యంలో లెనిన్ శతవర్ధంతిని ఆదివారం నిర్వహించారు. మొదట లెనిన్ చిత్రపటానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెట్టుబడి దారి సమాజానికి ప్రత్యామ్నాయంగా కష్టజీవుల రాజ్యం కోసం పోరాటాలే శరణ్యమన్నారు. రవి, బాబు రావు, కొంరయ్య, మహ్మద్ రాజాసాహెబ్, జగదీశ్వర్, మల్లికార్జున్, కుమారస్వామి, అరుణ్‌నాయక్, రమేష్, సాంబయ్య, గణేష్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో విద్యార్థులు రాణించాలి



ఎన్‌సీసీ విద్యార్థులతో ఉమేష్ పాస్తే

నెక్కొండ: విద్యార్థి దశలోనే ఎన్‌సీసీలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వరంగల్ 10వ తెలంగాణ బెటాలియన్ హవల్దార్ ఉమేష్ పాస్తే అన్నారు. నెక్కొండ హైస్కూల్‌లో ఆదివారం హెడ్మాస్టర్ రంగారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ఏ' సర్టిఫికెట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల శిక్షణ పొందిన కేడెట్లకు డ్రిల్ టెస్ట్, మౌఖిక, రాతపరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు 25 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ విభాగం ఇన్‌చార్జ్ వినయ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.